క్లుప్తంగా

వరదరాజ స్వామికి ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రు గ్రామంలోని వరదరాజస్వామి ఆలయంలో ధనుర్మాసం సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి దివ్య రజిత మకరతోరణ సహిత దివ్య ఆభరణాలు ధరింపజేశారు. తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించగా.. దేవాలయ కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివ రావు పర్యవేక్షించారు.

ఆటో బోల్తా.. వ్యవసాయ కూలీ మృతి



యల్లావుల యానాది

కర్లపాలెం: ఆటో బోల్తా పడి వ్యవసాయ కూలి మృతి చెందిన ఘటన బిడారుదిబ్బ గ్రామం వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఏఎస్ఐ సాంబశివ రావు వివరాల మేరకు పెదగొల్లపాలెం పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు ప్రతి రోజు ఆటోలో చెరుకుపల్లి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆటోలో సుమారు పదిమంది పనుల కోసం వెళ్తున్నారు. యాజలి సెంటర్‌లోని బిడారుదిబ్బ గ్రామం హైవేపై ముందు వెళ్తున్న సైకిల్‌ను ఆటో తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పెదగొల్లపాలేనికి చెందిన వ్యవసాయ కూలి యల్లావుల యానాది(43) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో సైకిల్‌పై ఉన్న వ్యక్తితో పాటు ఆటోలో ఉన్న మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న కాగిత దావీదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, యానాది మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని ఏఎస్ఐ చెప్పారు. మృతుడు యానాదికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కర్లపాలెం: ఎలుకల మందు తిని చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సాంబశివరావు వివరాల మేరకు.. యాజలి సమీపంలోని అక్కిరాజుదిబ్బ ఎస్టీ కాలనీకి చెందిన దేవరకొండ గోపి(20) ఈ నెల 12న మద్యంలో ఎలుకల పేస్ట్ కలుపుకుని తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతనిని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అతను మృతిచెందాడని ఏఎస్ఐ చెప్పారు. మృతుని తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్



నగరం: మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో సోమవారం సెబ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేపట్టినట్లు తెలిపారు. నాటుసారా కలిగి ఉన్న పేరం వెంకటేశ్వరమ్మను అరెస్ట్ చేశామన్నారు. ఆమె నుంచి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం విక్రయాలు జరుగుతుంటే సెబ్ పోలీసులు దృష్టికి తీసుకురావాలని కోరారు.

రేపు గ్రూప్‌-2 అభ్యర్థులకు అవగాహన సదస్సు

భట్టిప్రోలు: ఏపీపీఎస్సీ గ్రూప్‌-2 ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు బుధవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 7:30 గంటల వరకు తెనాలి ఎన్జీఓ కల్యాణ మండపంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సురేష్ కుమార్, ఎం. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు గ్రూప్‌-2కు ఏ విధంగా సన్నద్ధం కావాలి, పరీక్షా విధానం, సిలబస్ ఎలా ఉంటుంది అనే అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన అభ్యర్థులకు 120 పేజీల మెటీరియల్‌ను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు అండగా ఉంటా

- 'వేమూరు' వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- అద్దేపల్లి ఇందిరా కాలనీ, కొల్లూరు ప్రజలతో మాటామంతి



అద్దేపల్లిలో అశోక్‌బాబుకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

భట్టిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు అనుగుణంగా వేమూరు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి, ఎటువంటి కష్టం వచ్చినా వెన్నంటి ఉంటానని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి ఇందిరా కాలనీ వాసులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయా..? లేదా..? స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వేమూరు నియోజకవర్గం తనకు కొత్త అయినప్పటికీ పార్టీ శ్రేణులను ఏక తాటిపై నడిపించి అందరితో మమేకమై ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా మరోమారు ఎగురవేయాలని వరికూటి ఆకాంక్షించారు. ఇందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు అండదండగా ఉండి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా.. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున సహకారంతో పార్టీని ముందుకు తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. తొలుత కాలనీలో పాస్టర్ బొజ్జా ఏసు ప్రార్థన చేసి, ఆయనను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్, ఆర్‌సీఎం చర్చి వద్ద చిరు వ్యాపారులతో మాట్లాడి వారి కష్ట సుఖాలను అశోక్ బాబు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు పాలిపోగు రత్నరాజు, బొజ్జా రాంబాబు, బొజ్జా సామియేలు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు పీజీ అరుణ్‌శాస్త్రి, మోర్ల కోటేశ్వరరావు, గోలి శ్రీనివాసరావు ఉన్నారు.

సమష్టి కృషితో వైఎస్సార్ సీపీ విజయం

కొల్లూరు : వైఎస్సార్ సీపీ శ్రేణులు, కార్యకర్తల సమష్టి కృషితో వచ్చే ఎన్నికల్లో విజయం తథ్యమని వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం కొల్లూరులో పార్టీ శ్రేణుల సమన్వయం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు నాయకులను కలసి రానున్న ఎన్నికల్లో చేపట్టాల్సిన ప్రణాళికలపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేసి, వైఎస్సార్ సీపీ శ్రేణులకు, ప్రజలకు దగ్గరవుతానన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. మంత్రి మేరుగ నాగార్జున, బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు సహాయ సహకారాలతో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానన్నారు. ఇందుకు నియోజకవర్గంలోనే నివాసం ఏర్పాటు చేసుకుని, రానున్న ఎన్నికల్లో నూటికి నూరు శాతం విజయం సాధించే దిశగా కృషి చేస్తానన్నారు. అత్యవసరంగా పార్టీ మండలస్థాయి సమావేశాలు నిర్వహించి, బూత్‌కమిటీలు, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తొలుత కొల్లూరులోని సచివాలయం 1, 2లను సందర్శించిన ఆయన సచివాలయ సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావును పరామర్శించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఉప్పు శిరీష, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు సనక వెంకట్రావ్, మేకతోటి శ్రీకాంత్ ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, బావిరెడ్డి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, కమ్మెల సాంబశివ రావు, ఉప్పు శ్రీనివాసరావు, ఘంట శివరంగారావు, బారెడ్డి సుబ్బారెడ్డి, పాలిమేర నరసింహారెడ్డి, బొర్ర నాగేశ్వరరావు పాల్గన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి దోహదం



పంటను పరిశీలిస్తున్న మండల సమాఖ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

భట్టిప్రోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట దిగుబడులు ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని ఆ శాఖ మాస్టర్ ట్రెయినీలు బాలపాప, శివనాగేశ్వరమ్మ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని సమావేశం మందిరంలో సోమవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆఫీస్ బ్యారర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలు, ఏ గ్రేడ్ మోడల్స్, ఒకే పంట పొలంలో 20 నుంచి 25 రకాల పంటలు పండించడం ద్వారా కలిగే లాభాలను గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగవుతున్న పంటలను పరిశీలించారు. అలాగే ఘన జీవామృతం తయారు చేసుకునే విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, సీసీ రజనీకుమారి, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

వీవీఐటీలో బబుల్ గమ్ చిత్ర బృందం సందడి



కళాశాలలో చిత్ర బృందం ఆటాపాటా

పెదకాకాని: సీనియర్ నటుడు రాజీవ్ కనకాల, ప్రముఖ యాంకర్ సుమ దంపతుల కుమారుడు రోషన్ కనకాల ప్రధాన పాత్రలో మానస చౌదరి హీరోయిన్‌గా రవికాంత్ పారెపు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రేమకథ చిత్రం బబుల్ గమ్ బృందం వీవీఐటీలో సందడి చేసింది. ఈ చిత్రం డిసెంబరు 29న విడుదల కానున్న నేపథ్యంలో కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి నంబూరు వీవీఐటీని సందర్శించింది. హీరో రోషన్ మాట్లాడుతూ ఈ చిత్రం యువతను విశేషంగా ఆకట్టుకుంటుందని తెలిపారు. యుక్తవయస్సులో ఏదైనా సాధించాలి అనిపించినపుడు అవరోధాలు ఎదురొస్తే ఎలా ఎదుర్కోవాలి ? అనే సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో హీరో రోషన్, హీరోయిన్ మానస, డైరెక్టర్ రవికాంత్, నటుడు జబర్దస్త్ రాం ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేత



ఆయుష్మాన్ భారత్ కార్డును అందజేస్తున్న అధికారిణి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సోమవారం నిర్వహించారు. పెదకొండూరు గ్రామంలో నిర్వహించిన ఈ యాత్రకు సర్పంచి మేదర సౌజన్య, అగ్రికల్చర్ ఏఓ శిరీష ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఉజ్వల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్, సిలెండర్, రెగ్యులేటర్ అందజేశారు. యాత్రలో పాల్గొన్న వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డాక్టర్ హాసిని, క్షయవ్యాధి నివారణ అధికారి రవి పాల్గొన్నారు.

గొడవర్రులో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచి విశ్వనాథపల్లి ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఏపీఎం మహాలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి ఉజ్వల స్కీమ్ కింద అర్హులైన వారికి గ్యాస్ సిలెండర్, గ్యాస్‌స్టవ్, రెగ్యులేటర్, రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఉచితంగా నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

'స్పందన' ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి

అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర అదనపు కమిషనర్ కె. లక్ష్మీ శివజ్యోతి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ స్పందన నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని చెప్పారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎస్ఈ సుందరరామిరెడ్డి, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఆర్వోలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

ఉద్యోగుల సమస్యలపై అందే ఫిర్యాదుల్ని వేగంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు సూపరింటెండెంట్లను ఆదేశించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఉద్యోగుల సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

'స్పందన'కు 8 అర్జీలు

రేపల్లె: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమం చక్కని వేదిక అని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. మొత్తం ఎనిమిది అర్జీలు అందగా.. అందులో.. అంగన్వాడీల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు అర్జీ అందించారన్నారు. శ్మశాన వాటిక సమస్య పరిష్కారానికి నగరం మండలం కొలగానివారిపాలెం నుంచి అర్జీ అందగా, చెరుకుపల్లి మండలం ఆరేపల్లి గ్రామంలో 2012- 2016 మధ్య విధులు నిర్వహించిన వీఆర్వోకు అందాల్సిన ఏరియర్స్ కోసం ఒక అర్జీ అందిందన్నారు. సున్నా వడ్డీ రుణాలకు వేమూరు మండలం వరాహపుర గ్రామం నుంచి అర్జీ అందగా, ఎలక్ట్రిక్ పోల్స్ కోసం పట్టణంలోని 5వ వార్డు నుంచి అర్జీ, రేపల్లె-మోర్లవారిపాలెం గ్రామ రహదారి ఆక్రమణ తొలగించాలని, కొల్లూరు మండలం అనంతవరం గ్రామంలో డొంక ఆక్రమణలు తొలగించమని, తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని రేపల్లె పట్టణం నుంచి ఒక అర్జీ అందాయన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందన్నారు.

కారు ఢీకొని భార్యాభర్తలకు తీవ్రగాయాలు



గాయపడిన గంగరాజు

కర్లపాలెం: ద్విచక్ర మోటారు వాహనాన్ని కారు ఢీ కొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం కర్లపాలెంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్లపాలెం మండల పరిధిలోని నర్రావారిపాలేనికి చెందిన నర్రా గంగరాజు అతని భార్య మంగమ్మ పాలు తీసుకువచ్చి కర్లపాలెం పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ ఉంటారు. సోమవారం ఎంవీ రాజుపాలెంలో ఖాతాదారులకు పోసి, తిరిగి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై కర్లపాలెం సెంటరుకు వెళ్తుండగా.. చీరాల నుంచి అవనిగడ్డ వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొనటంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కర్రసాముతో మహిళలకు రక్షణ

నగరంపాలెం: శిలంబం (కర్రసాము) క్రీడ మహిళల రక్షణకు ఉపయోగపడుతుందని, మరింతగా ప్రోత్సహించాలని జిల్లా ఏఎస్పీ (పరి పాలన) కె.సుప్రజ పేర్కొన్నారు. ఇటీవల నాలుగో జాతీయ ట్రెడిషనల్ శిలంబం చాంపియన్‌- 2023 పోటీలు విజయవాడలో జరిగాయి. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో 20 బంగారు పతకాలు, 7 సిల్వర్ మెడల్స్, 7 బ్రాంచ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థుల్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని తన కార్యాయలంలో ఏఎస్పీ కె.సుప్రజ అభినందించారు. ఆమె మాట్లాడుతూ కర్రసాము వల్ల పిల్లలకు ధైర్యంతో పాటు ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. గురువులు కిరణ్, శ్రీనివాసరావు, కర్రసాము క్రీడ జిల్లా చైర్మన్ ముంజంపల్లి శివకుమార్ పాల్గొన్నారు.

పెదకాకాని పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర ఆరోగ్య బృందం



పెదకాకాని: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కేంద్ర ఆరోగ్య బృంద సభ్యులు సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల్ని పరిశీలించారు. ముందుగా ఆసుపత్రికి ప్రతి రోజూ వస్తున్న రోగుల సంఖ్య, మందుల పంపిణీ రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. మండలంలో రక్తపోటు, షుగరు వ్యాధితో బాధపడుతున్న వారి వివరాలు పరిశీలించి, వారికి ఎఫ్‌డీపీ ద్వారా అందుతున్న సేవల్ని పర్యవేక్షించారు. అనంతరం ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఐవీఏ టీమ్ డాక్టర్ సందేశ్, డాక్టర్ వరప్రసాద్, స్థానిక మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పులుసూరి ప్రవీణ దీప్తి, డాక్టర్ సింధూర, సూపర్‌వైజర్ పుసులూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు సాహసోపేత నిర్ణయం



సీఎం ప్రసంగం వీక్షిస్తున్న అధికారులు

భట్టిప్రోలు: ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షల వరకు పెంచడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయమని, దీంతో ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి పేర్కొన్నారు. మెగా ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమానికి సంబంధించి సీఎం జగన్ ప్రత్యక్ష ప్రసారాన్ని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీక్షించారు. ప్రతి లబ్ధిదారుడికి నూతన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరి స్మార్ట్ మొబైల్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసి అందే సేవలు ప్రతి ఒక్కరికి తెలిసేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, ఈవోపీఆర్డీ టి. ఉషారాణి, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహన రాకపోకలకు చెక్..!



లాక్ సెంటర్‌లో పడవల వంతెన వద్ద ఏర్పాటు చేసిన గడ్డర్లు

కొల్లూరు: శిథిలావస్థకు చేరిన పురాతన వంతెనలపై అధిక బరువులతో రాకపోకలు సాగించే వాహనాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు పశ్చిమ బ్యాంక్ కెనాల్, పడవల కాలువల వంతెనల మీదుగా ఇటుక, ఇసుక, ఇతర వస్తువులు రవాణా చేసే భారీ వాహనాలు రాకుండా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ వంతెనల మీదుగా భారీ వాహనాలు రాకపోల ఫలితంగా పైభాగం దెబ్బతిని, శిథిలావస్థకు చేరుకుంది. గతంలో పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన రక్షణ గోడలు కూలడంతో పాటు, ప్రస్తుతం పడవల కాలువ వంతెన పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అధికారులు ముందుస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని నిర్ణయించారు. అయితే కొన్ని నెలల ముందు ఇదేవిధంగా చర్యలు చేపట్టినప్పటికీ రాత్రిళ్లు గుర్తుతెలియని వాహనదారులు అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లను వాహనాలతో గుద్దించి రాకపోకలు యథాతథంగా సాగించారు. దీని కారణంగా పడవల వంతెన పూర్తిగా దెబ్బతినడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. 108 వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు మాత్రమే ప్రయాణించే విధంగా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. అధికారులు చేపట్టిన చర్యలతో భారీ వాహనాలు దోనేపూడి, ఈపూరు, చిలుమూరు, వెల్లటూరు వంతెనల మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

యాజలి(కర్లపాలెం): గ్రామంలో వేంచేసియున్న సుబ్రమణ్యేశ్వరస్వామి పుట్ట వద్ద సోమవారం స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వైఎస్సార్ సీపీ యాజలి గ్రామ కమిటీ అధ్యక్షుడు పేరాల వెంకట సురేష్ దంపతుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పుట్ట వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాండ్ర సాంబశివరావు, మందపాటి పరమానంద కుమార్ ముప్పిరి రాజశేఖర్, దొంతిరెడ్డి శివారెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో పతకాల పంట



విద్యార్థులను అభినందిస్తున్న ఫౌండర్ వెంకటేశ్వరరావు

నిజాంపట్నం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నిజాంపట్నం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని బోధి ధర్మ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పతకాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నిజాంపట్నంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో ఇండియా తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలను అకాడమీ ఆధ్వర్యంలో రేపల్లెలో నిర్వహించినట్లు చెప్పారు. క్రీడాకారులు పి.కార్తికేయ, పి.నాగతనూష, కె.అక్ష బంగారు పతకాలు సాధించారన్నారు. ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, మోపిదేవి శ్రీను, ఇంద్రగుప్తా, చంద్రం బుజ్జీ పాల్గొన్నారు.

ధాన్యం కాటాలో మోసం.. రైతుల ఆందోళన



వేబ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ

పొన్నూరు: వేబ్రిడ్జి తూకంలో మోసం చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మండలంలోని మన్నవ గ్రామ రైతులు సోమవారం ఆందోళన చేశారు. ప్రతి రోజు ధాన్యాన్ని తూకం వేసే క్రమంలో భారీస్థాయిలో మోసానికి పాల్పడుతున్నారంటూ రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని కట్టెంపూడిలో వేబ్రిడ్జి నిర్వాహకులు కొందరు రైసుమిల్లుల వారితో కుమ్మక్కై మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ధాన్యం లారీలు, ట్రాక్టర్లు బారుల తీరడంతో హడావుడిగా ధాన్యం కాటా వేసి రసీదులు ఇచ్చి పంపిస్తున్నారు. తర్వాత రైతులు ధాన్యాన్ని తీసుకువెళ్లి రైసుమిల్లులో విక్రయించాల్సి ఉంది. ఈ క్రమంలో మన్నవ గ్రామ రైతులకు చెందిన లారీ తూకంలో 11 క్వింటాళ్ల తేడా చూపించారు. మరో ట్రాక్టర్‌లో నాలుగున్నర క్వింటాళ్ల తేడా చూపించడంతో పసిగట్టిన రైతులు వేబ్రిడ్జి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని అధికారుల్ని కోరారు. సమాచారం తెలుసుకున్న తూనికల అధికారులు, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ధాన్యం తూకంలో వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు కూడా గుర్తించారు. రైతుల ఫిర్యాదు మేరకు శ్రీ లక్ష్మీ శ్రీనివాస వేబ్రిడ్జిలో తనిఖీలు చేయగా, తూకంలో తేడాను గుర్తించినట్లు తూనికల కొలతల జిల్లా అధికారి కొండారెడ్డి తెలిపారు. సంబంధిత రైతు 250 కిలోల వరకు నష్టపోయినట్లు గుర్తించామని చెప్పారు. వేబ్రిడ్జి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భగవద్గీత పారాయణానికి భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 10 నుంచి 16 వరకు నిర్వహించిన అఖండ అహోరాత్ర సంపూర్ణ భగవద్గీత పారాయణానికి భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ రావడం చాలా సంతోషంగా ఉందని శ్రీ దత్తహ్యూమన్ సర్వీసెస్, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు రామిరెడ్డి, వెంకటరత్నం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ట్రస్ట్ సభ్యులైన సుస్మిత, జయలక్ష్మి 9,540 నిమిషాలపాటు భగవద్గీత పారాయణం కొనసాగించారని తెలిపారు. భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కిందని వివరించారు. ట్రస్టు సభ్యులు రాజేంద్ర బాబు, యశ్వంత్ కుమార్, నాగేశ్వరరావు, నాగిరెడ్డి, రాంగోపాల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.